# లిటరరీ కోర్టు

(కాంతం కథల కేసు)

---

అది ధర్మం నాలుగుపాదాలా నడవడానికి పూనుకున్న సంస్థ. అక్కడ ముద్దాయిలు—నిజం వొప్పుకోవాలేకాని—ఎత్తుకు పైయెత్తు ఎత్తడానికి వీల్లేదు. ముద్దాయిలు ఏమైనా అఘాయిత్యం చెయ్యబోయారా అంటే.... సగరరాజుగారి సులేమాన్ యూనిఫారంలో పట్టాకత్తి పుచ్చుకుని—అల్లాహు అక్బర్ అంటాడు. ధర్మసంస్థాపనం చేయబూనిన శ్రీనివాస శిరోమణీ, శివశంకర శాస్త్రీజీ, ముద్దు కృష్ణాజీ, సారస్వత సర్దార్ రామకృష్ణ శాస్త్రీ, శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారూ వీళ్ళంతా అక్కడ జ్యూరర్లు. సర్దార్-మిష్టర్ కౌండిన్య, శ్రీరామచంద్రరావు ప్రభృతులు అక్కడి వకీళ్లు. అవసరాన్ని బట్టి జడ్జీలు మారుతూంటారు—

ఈ మాట ఫిర్యాది కాంతం కథకుడు, కాంతంభర్త శ్రీ వెంకటరావు.

సాయంత్రం అయిదుగంటలు అయింది. కవిమిత్రులందరూ సాయంత్రపు —ప్రోజనిన్స్పిరేషన్‌తో కోర్టు విశేషాలు చూసి పోదామని ఒక్కరొక్కరే వొచ్చారు. ఆ న్యాయస్థానంలో కవిమిత్రులు సిగరెట్లు త్రాగవచ్చును. ఒక్క దీక్షితులుగారు తప్ప యింకోరు పొడుం స్మరణైనా చేయకూడదు.

హాలు అంతా కిటకిటలాడుతూన్నది. ఆట్టే విశేషాలు లేకుండా జడ్జీగారు వొచ్చి ...రత్నకంబళంమీద ఓ పెద్దదిండు నానుకుని కూర్చున్నారు.

వేళ అయింది: అందరూ వొక్కసారి హుషార్ దేవతను ధ్యానం చేసుకున్నారు. కోర్టు కోర్టు అంతా 'హరహర మహాదేవ్' అని అన్నారు

వెంటనే ఫిర్యాది.... లేచి యిల్లా చెప్పారు:

"న్యాయస్థానానికి తెలియపర్చుకునే దేమిటంటే.... నేను మా. సాహితీ సమితి సభ్యుణ్ణయినప్పటినుంచీ సంసారమును చిత్రించి చూపే కథలు రాస్తున్నాను. అవి చాలాభాగం మా సాహితిలోనే అచ్చు అయినవి.... దేశంలో అవి అంతో యింతో పేరు సంపాయించుకున్నవి. కొన్ని మొదటి కథలు....'కాంతం కథలు' అనే పుస్తకంగానూ, తరువాత రాసినవి 'నేనూ—మా కాంతం—' అనే గ్రంథంగానూ ప్రకటించాను. యిప్పుడు రాస్తున్నవీ—ముందు రాయబోయేవీ కలిపి యింకో సుందరమైన గ్రంథం వేయించాలని సంకల్పం!

అటువంటి పరిస్థితుల్లో.... వెనక.... కొంతకాలం క్రితం, శ్రీ వెంపటి నాగభూషణం—గారు చిన్న కథలు రాస్తూ వొచ్చారు....లోకంలో —నాగభూషణానికి సంసారవిషయాల్లో అనుభవం లేకపోయినప్పటికీ— 'కాంతంకథలు' చూసి—ట్రూకాపీలు దించుకున్నాడని—ఓ గోల బయలుదేరింది—నాకూ ఆ అనుమానమే వేసింది.... ఆ అనుమానాన్ని తేల్చుకోకుండానే వొదిలిపెట్టాను....ఈ మధ్య నాగభూషణంగారు....'పండగ మామూలు' అన్న కథలో— నా 'నల్లటి మనిషి' అనే కథను ఊచ యుద్ధం చేసినట్లు నలుగురూ అనుకోవడం—జరిగింది. ఇది భావ్యంకాని పని.... తరువాత శ్రీ పింగళి నాగేంద్రరావుగారు నాకు మిత్రులై సరసులై ఉండికూడా కృష్ణాపత్రికలో—'కాంతం డైవోర్సు' ప్రచురించారు. అది చాలా సరసంగానూ నీతియుతంగానూ ఉన్నప్పటికీ—అనుసరించే తాఖత్ లేని ఆధునిక అగస్త్యానుజన్ములకి పిచ్చిరాతలు రాయటానికి హేతుభూతమైనది....తర్వాత 'ఉషస్సు' అనే పత్రికలో ఎవరో ఎం. లక్ష్మణరావు గారట 'మా మేష్టరుగారు' అనే కథ రాశారు....అందులో నన్ను గురించి చాలా అన్యాయంగా— నీతిభంగంగా....తప్పుడు ధోరణిలో

రాశారు. లక్ష్మణరావుగారు వ్రాసినట్లుగా....యింకా అనర్థకపు వ్రాతలు దేశంలోనికి వొస్తే....అవినీతి ఎక్కువౌతుందని శేషాంగ శ్రేణికి రక్ష సేయగ....పైన చెప్పిన ముగ్గురిమీదా అభియోగం తెస్తున్నాను—"

కోర్టువారు శ్రీ వెంపటి నాగభూషణం గారిని పిలిపించారు.

## 2

ఆయన ఆజానుబాహువు. ఎవరో పిచ్చికవిమిత్రుడు చెప్పినట్లు—"అతని ఆకృతిజూడ కాయము వణంకు" అన్నమాట—నిజానికి—కొద్దిపాటి దూరమైనా...."జబరదస్తీ వాడురా—భూషనుడు బుగులు పుట్టిస్తాడురా" అనే పాట—చాలా అన్వర్థంగానే ఉన్నట్లుంది—చేతిలో కర్రా—మడతపెట్టిన ఉత్తరీయం....ఆయన వొచ్చీరావటంతోనే—కూర్చునే ప్రయత్నంలో ఉంటే, కోర్టువారు ఆయన్ని కూర్చుని మాట్లాడమన్నారు—

కోర్టువారికీ సదరు ఎం. ఏ. గారికీ యీ క్రింది సంభాషణ జరిగింది....

"మీరిప్పుడు ఎక్కడ ఉంటున్నారు?"

"అసలు మాది బందరే కానీండి....ప్రస్తుతం బికనీరులో ఉంటున్నాను"

"మీమీద ఫిర్యాది శ్రీ వెంకటరావు....మీరు ఎటికెట్‌కు భంగంగా వ్రాసినారని అభియోగం తెచ్చారు. అయితే మీరు 'కాంతం కథల' లోని అభిప్రాయాల్ని తీసుకుని 'చిన్నికథలు' రాసిన మాట నిజమేనా?"

"అదేంమాటలెండి కొన్ని స్వంత అభిప్రాయాలూ ఉన్నవి....?"

శ్రీ వెంకటరావుగారు లేచి 'కీర్తికోసం' అన్న కథ తప్పితే మిగతా తమరు రాసిన 'చిన్నికథలు' కాంతంకథల నమోనాలని లోకం గుర్తించుకోలేదూ?"

"ఒక్క 'కీర్తికోస' మేనా? లక్షలు ఉన్నవి.... నా స్వంతములు ...." శ్రీకౌండిన్యగారు లేచి.... వెంకటరావుగారితో—"అయ్యా .. శ్రీ నాగభూషణంగారు చిన్నీ కథలలో మీ అభిప్రాయాలూ మీ అనుభవాలూ రాస్తే.... మిమ్మల్ని ప్రకటన చెయ్యడమే కదండీ...."

"అయితే కీర్తి ఆశించలేదంటారా?"

"కీర్తి అనే పదార్థం దానంతట అది వొస్తుంది...."

"భాయిసాబ్....! ఒకరి ఊహల్ని తమ స్వంత ఊహలుగా మభ్యపెట్టడం న్యాయమంటారా?"....

"న్యాయమనటంలేదు. కాని...."

శ్రీ నాగభూషణంగారు "నా తరఫు అన్ని మాటలూ శ్రీ కౌండిన్య గారు మాట్లాడుతారని" చెప్పి కూర్చున్నారు.

కోర్టు: 'పండగమామూలు' అన్న కథలో 'నల్లటి మనిషిని' గురించి వ్రాయటం భావ్యమా?'

శ్రీ కౌండిన్య : నా క్లయింటయిన శ్రీ భూషణ్‌గారు మొదట 'చిన్నీకథలు' రాసే రోజుల్లో ఏదో స్నేహరీత్యా 'కాంతంకథలు' లోని అభిప్రాయాలు రాస్తూ వొచ్చినా.... అది సాధనకోసమేకాని.... మరేమీ దురుద్దేశ్యంతో కాదు. అలా కొంతకాలమయిన తరువాత.... తాను కూడా ఒక కథకుడుగా లెఖ్ఖపెట్టుకుని మొదటివారిని సమాన ఉజ్జీలుగా తలవ వచ్చు.... అది పరిణామశాస్త్ర ప్రకారం నిర్దోషమైన సంగతి.... తరువాత అంటారూ—ఏదో హుషారుగా అట్లా 'పండగమామూలు' అన్న కథలో రాశారు కాని.... వెంకటరావుగారిని అల్లరి చేయవలెననే కాదు.

కోర్టు : ముద్దాయినడిగి తెలుసుకోవలసిన సంగతులేమైనా ఉన్నాయా?

అంతా మౌనం. జ్యూరర్లు ఏమీ మాట్లాడలేదు.

కోర్టు: సరే-జడ్జిమెంటు చేప్పేస్తున్నాం. [విషయాలు?] విశదమైనవి. శ్రీ వెంకట్రావుగారు తెచ్చిన అభియోగం సరియయినదే. శ్రీ నాగభూషణంగారు స్నేహితులమీద అల్లా రాయకూడదు. అది తగనిపనే.... కనక శ్రీ సదరు ముద్దాయి ఖర్చులో ఖర్చు అని తలచక వక్కసారి కాశీపోయి మాలవ్యాజీని, ధ్రువాగారినీ, దర్శించి.... గంగ ఒడ్డున.... స్నానం చేసి (ఈదటానికి ధైర్యంవుంటే ఈదొచ్చు....) విశ్వేశ్వరుడికి దణ్ణంపెట్టి తదాదిగా త్రిరత్నస్మరణ చేస్తూ....ఎద్దులబండీ కట్టించుకుని సారనాథ్‌కు పోయి కొంతకాలం బౌద్ధమత గ్రంథాలూ, త్రిపిటకాలూ.... అవీ చదువుకుని....'పతం బుద్ధానుశాసనం' అనుకుంటూ పద్మశ్రీ వ్రాసిన నాగరసర్వస్వాన్ని ఒక్కసారి అంటే ఒక్కసారి చదివి దాని మీద రివ్యూ ఒకటి ఇంగ్లీషులో 'త్రివేణి' కీ—తెలుగులో కృష్ణా పత్రిక్కూ—పంపి అక్కణ్ణుంచే దీక్షపుచ్చుకుని బౌద్ధభిక్షువు అయిపో వలసినదిగా కోర్టువారు శిక్ష విధిస్తున్నారు.

తక్కుంగల విశేషాలు చూడటానికి గాను నాగభూషణంగారు అక్కడే ఉండిపోయారు.

## 3

శ్రీ పింగళి నాగేంద్రరావుగారు వొచ్చారు....

కవి ప్రాఫింగు వున్నది; ఆయన కళ్ళద్దాల తత్వవేత్త.

కోర్టువారు: శ్రీ వెంకట్రావుగారు— 'కాంతం దైవోర్సు' రాసినందులకు మీ మీద అభియోగం తెచ్చారు: మీరేమైనా చెప్పుకుని మీ నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకుంటారా?

శ్రీ నాగేంద్రరావుగారు మౌనముద్ర వహించారు.

కోర్టుకూ— కవికీ— యీ క్రింది సంభాషణ జరుగుతుంది :

"మీరు సరసులూ పెద్దఫాయిదావారూ కదూ?"

"ఆమాట నన్నడిగితే ఏం తెలుస్తుంది?...."

"మీరు 'కాంతం డైవోర్సు' అచ్చుకిచ్చేటప్పుడైనా ఆలోచించవొద్దూ.... ఇటువంటి ప్రమాదములు జరుగుతవనీ...."

"ఎందుకో యీ ప్రమాదాలు.... నా విధి నేనే నియమించుకొందును. స్వయంవేధ క్రియారంభినై ...."

"ఏదీ— మళ్ళీ ఒకసారి చదవండి ఆ పద్యం."

"అధి శాసింపగ జీవి జీవన గతన్యాసంబు గావింప నీ

విధి యెవ్వండు మదీయ జాతకముపై వ్రేలుంచి వాదింప నే

యధికారంబును నే గ్రహంబునకు నేయంశంబునన్ లేదు, నా

విధి నేనే నియమించుకొందును స్వయంవేధ క్రియారంభినై."

"సెభాష్— బేషుగ్గా ఉంది పద్యం. మీ నేరాన్ని గురించి ఏమీ చెప్పరూ"

"ఎందుకూ చెప్పడం?"

"సరే సెంటెన్సు చెప్పేస్తున్నాం."

కోర్టువారు : శ్రీ వెంకట్రావుగారు తెచ్చిన అభియోగంలో ఏమీ కల్తీలేదు....రెండో ముద్దాయి శ్రీ నాగేంద్రరావుగారు చాలా మంచివారు. సరసులు.... వెనక ఎవరో రాసినట్లు పింగళివారి పేరు నిలబెట్టినవారు. వీరి 'నా రాజు' ఉత్తమశ్రేణికి చెందిన రూపకం. అయితే సదరు ముద్దాయి ఏదో స్నేహరీత్యా కొత్త పోకడ తీర్చికూర్చే నవ కవి గనుక 'కాంతం డైవోర్సు' అనే కథ రాసి ప్రచురించారు. [బాగానే?] ఉంది.

అయితేనేం "విషమప్యమృతం క్వచిద్భవేత్ తదమృతం వా విషమీశ్వరేచ్ఛయా!" ఆధునిక ఆగస్త్యానుజన్ములు అనుసరించే తాఖత్ లేక పిచ్చి కథలు [రచిస్తారు?]. అయితే వీరివల్ల కాకపోయినా.... పారంపర్య వశాత్తూ.... కొంత నీతికి భంగం కలిగింది. కనుక.... సదరు ముద్దాయి అయిన నాగేంద్రరావుగారు నేటి నుండీ.... నాటకాల విషయంలో తప్ప మిగిలినప్పుడు బందరు పొలిమేరలు దాటిపోకూడదు.... బందరులో కూడా గొడుగుపేటా....రాబర్టుసన్ పేటా....దాటరాదు.... సాయంత్రపు టీ కూడా ఆనందభవన్‌లోనే— అప్పుడప్పుడు కృష్ణాపత్రిక ఆఫీసుకు పోవచ్చును,— దీనిని కవిగారు అతిక్రమించే ఎడల కోర్టు వారి విషయమై తగుచర్య తీసుకుంటుంది—

సర్దార్ శాస్త్రి చిరునవ్వునవ్వి ఊరుకున్నాడు. శ్రీ నాగేంద్రరావుగారు అక్కడే ఓ బాలీసునానుకుని సిగరెట్టు పైకితీశారు, కవిమిత్రులందరూ ధూమపూజ చేసే వేళ్ళైంది కనుక.... కోర్టుపనులు ఓ పావు గంట ఆపేశారు.

## 4

మళ్ళీ కోర్టు- తెరిచారు. జ్యూరర్లు హుషారుగా ఉన్నారు.

మళ్ళీ అందరూ 'హరహరమహాదేవ్' — అన్నారు. మూడో ముద్దాయి శ్రీ లక్ష్మణరావుగారు వొచ్చి నుంచున్నారు.

శ్రీ వెంకట్రావుగారు లేచి 'నా తరపున అన్ని మాటలూ శ్రీ రామచంద్రరావుగారు మాట్లాడుతా'రని చెప్పి కూర్చున్నారు.

కోర్టువారు వెంకట్రావు తెచ్చిన అభియోగాన్ని ముద్దాయికి తెలియ చెప్పారు. ముద్దాయి చలించలేదు.

శ్రీ రామచంద్రరావుగారికీ, లక్ష్మణరావుగారికీ—

"మనదేవూరూ?"

"ఏ వూరైతే ఏంలెండి."

"ఓహో- అల్లాగేం- 'మా మేష్టరుగారు' అన్న కథ రాయటంలో మీ వూహ ఏమిటో చెప్తారా?"

"కవి ధర్మం కనుక."

"అటువంటి కథలు రాయటమా కవి ధర్మం అంటే...."

"ఎందుకు గాదూ?"

"ధర్మసంస్థాపనం కోసం పెట్టిన కోర్టు" అంటూ శ్రీనివాస శిరోమణిగారు కళ్ళు ఉరిమి చూసేసరికి ముద్దాయి భీతిపోయినాడు.

శ్రీ శివశంకరశాస్త్రిగారు.... శిరోమణిగారితో—"అల్లా అనకండి—ముద్దాయి భితిపోయాడు"- అని సర్దిచెప్పినాడు.

"మీరు నిజానికి బద్ధులవుతారా?"

"నే నిజాన్ని వొప్పుకుంటా."

"ఆ కథ రాయడంలో మీ ఉద్దేశం...."

"జెలసీ"

"ఆల్‌రైట్. వెంకటరావును గోపాలరావుగా మార్చి పిలకా క్రాపింగు పెట్టుకున్నారనీ— కాలు ఎత్తెత్తి వేస్తుంటారనీ.... స్ఫోటకం దేవత ఆయన ముఖంమీది అందం, బుగ్గలమీది నునుపూ అంతా పీల్చేసిందనీ రాయడం తప్పుకాదూ?"

"అన్యథావా ప్రకల్పయేత్" అని శాస్త్రకారుడు కవికి స్వేచ్ఛ నివ్వలేదూ?"

శివశంకరపండితులు కొద్దిగా నవ్వుకున్నారు. సర్దార్ శాస్త్రికి ఘాటుగా కోపంవచ్చింది —

"సుందరం పాత్రచేత— 'వాడి బొంద- ఉత్త శుంఠ- వాడికి Orginality లే' దనిపించారు-తప్పుకాదూ."

"ఆ కసిలో అల్లా రాసినా తప్పు లేదనిపించింది."

"ఆయన మిమ్మల్ని గురించి ఏమైనా పరుషములాడి ఉన్నాడా?"

"లేదు."

"అయితే ఆయనమీద మీ కెందుకూ అంత కసి?"

"కీర్తి వస్తోందని."

"పోనీండి- కీర్తి కాముకులు అయారని పెద్దవాళ్ళని పట్టుకు తిడితే వొస్తుందా- మీకు కీర్తి?"

.... .... .... ....

"పోనీండి దేశంలో నలుగురికీ తెలియటం తిట్ల వ్యాసంతోనేనా?"

.... .... .... ....

"పాపం మీ వల్ల మాధవశర్మగారెంత నష్టపడ్డారో ఎరుగుదురా?"

"ఏం నష్టమూ మాధవశర్మకూ?"

"ఏం నష్టమని నెమ్మదిగా అడుగుతున్నారేం?—ఆయన 'ఉషస్సు'కు కొత్త చందాదార్లు చేరడంలేదు—"

"నా వల్లనా?"

"యింకా ఎవరివల్ల?"

"నిజం?"

"నిజమా నిజంన్నరా?"

కోర్టు: ముద్దాయినడిగి తెలుసుకోవలసినవి యింకా ఏమైనా ఉన్నవా?

ఏ.పి. బ్రౌన్ గ్రంథాలయం, కడప.
ప్రవేశ సంఖ్య
తేదీ



శ్రీ రామచంద్రరావు : "లేవు."

కోర్టు : (జ్యూరీలవంక తిరిగి) మీ ఉద్దేశం ఏమిటీ—?

జ్యూరీ : శిక్ష కొంచెం ఘాటుగా తగలాల్సిందే!

జ్యూరీలో సుబ్రహ్మణ్యశాస్త్రిగారూ. శ్రీ శంకరశాస్త్రుల్లుగారూ— కొంత సందేహించారు. ముద్దుకృష్ణా— శిరోమణీ— సర్దార్‌శాస్త్రీ శిక్ష ఘాటుగానే ఉండాలన్నారు : పై యిద్దరూ కూడా కొంచెం మెత్తపడ్డారు.

కోర్టువారు : సరే జడ్జిమెంటు చెప్పేస్తున్నాము. వెంకటరావుగారన్నట్లు— "లక్ష్మణరావుగారు వ్రాసిన- 'మా మేష్టరుగారు....' అనే కథ నీతికి విరుద్ధమైనదే.... ఆ కథ చదివిన ప్రతివాడూ కొంతం కథకుణ్ణి ఏకేశాడని అనుకోవడానికి వీలున్నది : తనకు ఆ కథలు నచ్చకపోతే— పాత్రపోషణలోనో— ఔచిత్యంలోనో— ఇతివృత్తంలోనో— సందర్భ శుద్ధిలోనో— భాషావిషయంలోనో— దోషాలు- హనుమదింద్రకంటి 'వకుళమాల'లో చూపినట్లు చూపి సక్రమమైన విమర్శ చేస్తే బాగుండేది.... అలా కాకుండా..... జెలసీని చూపించాడు రచయిత.... అది దోషయుక్తమైన సంగతి- శ్రీ వెంకట్రావుగారు సంసారమును చిత్రించి చూపే కథలు రాస్తున్నారు. అదో ఆర్టుగా కళావిదులు సంతోషిస్తున్నారు : అసలు విమర్శనకొస్తే శ్రీ గురజాడ అప్పరాయకవి తెలుగు సారస్వతానికి గిరీశాన్ని యిచ్చినట్లు తెలుగు సారస్వతానికి- కాంతాన్ని చక్కని ఆదర్శవతిని- రసజ్ఞను- గేస్తురాలిని- శ్రీ వెంకట్రావుగారు యిచ్చారు. సాహితీ సమితిలోని ఉత్తమ రచయితల్లో- శ్రీ రావుగారొకరు- యీ కథలకు కాంతంకూడా సంతోషిస్తున్నది- కానీ లక్ష్మణరావుగారు రాసినట్లు దుఃఖించడంలేదు.

అయితే ప్రతిభావంతుడు గనక కథకుడు ప్రతి అంశమూ జరిగినదా అనిపించేంత నసిగా రాస్తారు. అవి తెలుసుకోలేని గుడ్డి లోకం

యింట్లో జరిగిన సంగతి రాసేస్తున్నా డనుకుంటుంది. అట్టి శ్రేణిలో వారే లక్ష్మణరావుగారు కూడా. వీరు నిష్కారణంగా జెలసీ తెచ్చుకుని.... శ్రీ వెంకట్రావుగారి మీద అల్లా రాసినందుకూ.... ఆ రాతలోకూడా ధైర్యం లేకుండా—'నేనూ—మా కాంతం' అనే పుస్తకాన్ని 'నేనూ—మా ఆవిడా'—అని రాసినందుకు, దేశసేవను 'ప్రజాసేవ'గా రాసినందు లకూ యీ ముద్దాయికి విధించే శిక్ష ఏమిటంటే;" కోర్టువారు, శిక్ష అనే సరికి ముద్దాయి కంపితుడైనాడు. శ్రీ కౌండిన్య సిగరెట్టు తీశాడు. అంతా సిగరెట్లు సంధించారు. "సదరు మూడో ముద్దాయి శ్రీ లక్ష్మణరావుగారు, 'మా మేస్టరుగారు' అనే కథ వ్రాసి వెంకట్రావుగారికి మనఃక్లేశం తెప్పించడమే కాకుండా....'ఉషస్సు' అనే పత్రికకు కొత్త చందాదార్లు చేరకుండా చేసినారు గనుక, సదరు ముద్దాయి తెనాలి సమీపంలో ఉండే చినరావూరి చెరువులోపడి మునిగిపోవాలిసింది—"

శ్రీ వెంకట్రావుగారు గళస్థగాద్గదికంతో "యింతటి దారుణ శిక్ష విధించేటట్లయితే—కేసు తీసివేసుకుంటాను" అని అన్నారు. కోర్టు ఏమందంటే "అది వీల్లేనిపని ....అసలు కేసు తీసుకువచ్చి యింత విచారణయై కొన్ని తీర్పులు చెప్పేశాకా యీ పనీ" అని. తరువాత వెంకట్రావు కొంత దయ తలచమంటే....మళ్ళీ యిల్లా తీర్పును కొంత సవరించారు. ఆత్మ....పూర్తి అయింతరువాత vaman Gopal's సారసపరిల్లా లక్ష్మణరావుగారు పుచ్చుకోవలసిందనీ — యీ లోపుగా కోర్టు కోమాటు కనిపించి పోవాలనీ—'ఉషస్సు' పత్రికకు ఓ యాభై కొత్త చందాలు కట్టించమనీ—

కోర్టు మూశేశారు. కవి మిత్రులందరూ తెలుగుతల్లి పాటా, నిత్యా జేజే పాటా పాడుకుని ఎవరి యిళ్ళకు వాళ్ళు పోబోతూంటే శ్రీ వెంపటి నాగభూషణంగారు వికటంగా ఏతం బుద్ధానుశాసనం అంటూ కలర్ డ్రింక్ ఒకటి త్రాగి చేక్రర త్రాటిస్తూ—గుడ్‌బై కొట్టినారు.